

నేడు రైతుల ఖాతాల్లోకి రూ.133.48 కోట్లు జమ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఈ ఆర్థిక సంవత్సరం మొదటి విడత వైఎస్ఆర్ రైతు భరోసా, పిఎం కిసాన్ ఆర్థిక సాయం రూ.133.48 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కర్నూలు జిల్లా నుంచి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ప్రారంభిస్తారని తెలిపారు. తిరుపతి జిల్లాలోని 1,76,921 మంది రైతులకు రూ.7500 చొప్పున సుమారు రూ.133.48 కోట్ల లబ్ధి చేకూరనుందని తెలిపారు. అలాగే జిల్లాలో మార్చి 23 నుండి మే23 వరకు పడిన అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం 416 మందికి 32.93 లక్షలు జమ కానున్నదని పేర్కొన్నారు.

యజమాని అత్యాశ అధికారుల నిర్లక్ష్యం

ముగ్గురు దుర్మరణం

మరో ఇద్దరి పరిస్థితి విషమం
అనుమతి లేకనే టపాసుల తయారీ
ఉన్నతాధికారులపై చర్యలుండవా..?



ఎపుడూ అంతే... ఏదైనా ఘటన జరిగినపుడే ఉన్నతాధికారుల హడావిడి.. కోట్లల్లో వ్యాపారం జరుగుతున్న వీరయ్య టపాసుల అంగడిలో సొంతంగా బాణసంచా తయారు చేస్తున్నారన్న విషయం అందరికీ తెలుసు... పెద్దఎత్తున ఆర్డర్లు రావడంతో నల్లమందు నిల్వలూ అనధికారికంగా ఉన్నాయి.. కేవలం గోడౌన్ నిల్వలకే అనుమతి ఉందని చెబుతున్న వీరయ్య, ఆర్డర్లు పెరగడంతో సొంతంగా టపాసుల తయారీకి ఉపక్రమించాడు.. అంతోఇంతో అందులో అనుభవం ఉన్న ఏడుకొండలును గూడూరు నుంచి రప్పించుకున్నారు. స్థానికంగానే ముగ్గురు కూలీలను నియమించుకుని రోజుకు లక్షల్లో టపాసులను తయారు చేస్తున్నాడు.. ఇటీవల జాతరలు, తిరునాళ్లు ఎక్కువగా జరుగుతూ పెద్దఎత్తున వ్యాపారం జరుగుతోంది. అంతేకాదు త్వరలోనే సూళ్లూరుపేట చెంగాళమ్మ జాతరకూ పెద్దమొత్తంలో ఆర్డర్ ఉంది.. బుధవారం ఏమయ్యిందో గానీ.. టపాసుల గోడౌన్‌లో పెద్దఎత్తున పేలుడు సంభవించింది. ముగ్గురు యువ కూలీలు అక్కడికక్కడే మృతిచెందారు. మరో కూలి కల్యాణ్, యజమాని వీరయ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అనుమతి లేకుండా ఇంత పెద్దమొత్తంలో ప్రమాదకరమైన టపాసుల వ్యాపారం చేస్తున్న వీరయ్య గోడౌన్‌పై ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదో? వారికే తెలియాలి.




ప్రజాశక్తి -వరదయ్యపాలెం (తిరుపతి జిల్లా)

అసలే అనధికారికంగా టపాసుల తయారీ నడుస్తోంది. టపాసులు ఎక్కువ మొత్తంలో నిల్వ ఉన్నాయి. ఇందుకు సంబంధించి తహశీల్దార్, అగ్నిమాపక అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాల్సి ఉంది. ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదంజరిగితే వెంటనే ప్రాణ, ఆస్తి నష్టం తగ్గించేలా అందుబాటులో మంటలను ఆర్పే గ్యాస్, నీరు, ఇసుక అందుబాటులో ఉంచాలి. సంబంధిత అధికారులు సైతం టపాసుల అమ్మక కేంద్రాన్ని నేరుగా సందర్శించి ఆ ప్రాంతాన్ని మ్యాప్ రూపంలో నిక్షిప్తం చేసిన అనంతరం అనుమతులు ఇస్తుంటారు. అమ్మకానికి సంబంధించిన గోడౌన్‌కే ఇన్ని ప్రమాణాలు పాటించాల్సి ఉంది. అయితే ఏకంగా టపాసుల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినపుడు జిల్లా స్థాయి అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంది. అయితే కనీసం మండల స్థాయి అధికారుల అనుమతి లేదు. వారు పర్యవేక్షించింది అంతకన్నా లేదు. కొంతమంది అధికారులు మామూళ్లకు అలవాటు పడి ఇంటువంటి కేంద్రాలను పట్టించుకోకుండా ఉండటం వల్లనే ప్రమాదాలు జరిగి అమాయకులు ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు.

వరదయ్యపాళెం మండలం శాతంబేడు గ్రామ సమీపంలో వీరయ్యకు టపాసుల గోడౌన్ ఉంది. పరిసర ప్రాంతాల్లో శుభకార్యాలు జరిగినా, ఎవరైనా చనిపోయినా, ఇతరత్రా కార్యక్రమాలకు ఇక్కడినుంచే టపాసులు కొనుగోలు చేస్తుంటారు. ఈ క్రమంలో వీరయ్య అత్యాశకు పోయి టపాసులను స్థానికంగా తయారు చేసి అమ్మే ప్రయత్నం చేశాడు. గూడూరు ప్రాంతానికి చెందిన ఏడుకొండలును పనికి కుదుర్చుకున్నాడు. పక్కనే ఉన్న ఎలకట్టవ గ్రామానికి చెందిన శంకరయ్య, నాగేంద్ర, కల్యాణ్‌లను పనిలో పెట్టుకుని టపాసులు సొంతంగా తయారు చేసి అమ్మడం ప్రారంభించాడు. ఎటువంటి జాగ్రత్త చర్యలు తీసుకోకనే నల్లమందును దిగుమతి చేసుకుని సొంతంగా టపాసులు తయారు చేయడం మొదలు పెట్టాడు. చుట్టుపక్కల ప్రాంతాలలో చాలాచోట్ల జాతరలు, తిరునాళ్లు ఉండటం వల్ల ఆర్డర్లు ఎక్కువ రావడంతో పెద్దమొత్తంలో నల్లమందును దిగుమతి చేసుకున్నట్లు సమాచారం. అయితే ఈ ఘటన ఎలా జరిగిందన్నది విచారణలోనే తేలాల్సి ఉంది. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా అలసత్వం ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఏడుకొండలు, శంకరయ్య, నాగేంద్ర ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందగా, వీరయ్య కల్యాణ్ తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్ఐ నాగార్జునరెడ్డి, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శివకుమార్‌రెడ్డి తెలిపారు. కల్యాణ్ స్థానికంగా వాలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఐదువేల రూపాయలు చాలకపోవడం వల్లనే ఇద్దరు పిల్లలను పోషించుకునేందుకు టపాసుల గోడౌన్‌లో పార్ట్‌టైం కూలి పనులు చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. శంకరయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూతురికి పెళ్లి చేసి ఆర్థిక ఇబ్బందుల కారణంగా కూలీగా పనిచేస్తున్నాడు. నాగేంద్రకు భార్య ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ప్రస్తుతం ఆమె నిండు గర్భవతి అని సమాచారం. ఆర్థిక పరిస్థితులు బాగోకపోవడం వల్లనే ప్రమాదకరమైన పనుల్లో వీరు చేరినట్లు సమాచారం. బుధవారం పేలుడుకు మృతదేహాలు తునాతునకలై చెల్లాచెదురుగా పడి ఉండడంతో కుటుంబీకులు భయభ్రాంతులకు గురై కన్నీరుమున్నీరయ్యారు.

కూలీల కుటుంబాలను ఆదుకోవాలి : సిపిఎం

కుటుంబ పోషణ కోసం టపాసుల తయారీలో ప్రమాదవశాత్తు ప్రాణాలు విడిచిన కూలీల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు దాసరి జనార్ధన్ డిమాండ్ చేశారు. ప్రమాదానికి కారణాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుంటా టపాసుల తయారీ ప్రారంభించిన వీరయ్యను కఠినంగా శిక్షించాలన్నారు. అనుమతులు ఉన్నాయో, లేవో పరిశీలించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.



'ఉపాధి హామీ' లక్ష్యాలను పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఉపాధి హామీ చట్టం లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ ఛాంబర్‌లో ద్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్‌తో కలిసి వర్చువల్ విధానంలో సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. 'అమృత్ సరోవర్ పథకం' కింద ఇంకనూ పూర్తికాని పనులను వేగవంతం చేయాలని, కూలీల హాజరు శాతం పెరగాలని, హార్టికల్చర్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. వర్షాకాలం లోపు ఉపాధి హామీ పనులు లక్ష్యం మేరకు జరిగేలా వేగవంతం చేయాలన్నారు. సరాసరి కూలి రూ.272 తగ్గకుండా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ వారంలో ఉపాధి హామీ కూలీల హాజరు లక్షా 25వేలు దాటేలా ఎంపిడిఒలు పురోగతి సాధించాలన్నారు. ఎస్సీ ఎస్టీ కుటుంబాలు నిబంధనల మేరకు కవరయ్యేలా గ్రామ పంచాయతీల వారీగా గుర్తించి పనులు కల్పించి పని దినాలు మెరుగ్గా ఉండేలా చేయాలన్నారు. 50శాతం కన్నా పురోగతి తక్కువ ఉన్న మండలాల పనితీరు మెరుగుపడాలన్నారు. ఉద్యానపంటలు వేసుకునే వారికి త్వరితగతిన ఎపిఎంఐపి ద్వారా డ్రిప్ మంజూరు చేయడం జరుగుతుందని, రైతులను ప్రోత్సహించాలన్నారు. ఆగస్టులోపు గుంతలు తవ్వడం, మొక్కలు నాటడం చేయాలన్నారు. జిల్లాలో ప్రస్తుత సరాసరి కూలి రూ.260 ఉందని, 272 అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆధార్ అనుసంధానం కాని 7,346 జాబ్‌కార్డులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అమృత్ సరోవర్ పథకం కింద మంజూరైన 105 పనుల్లో ఇంకా పూర్తికాని 21 పనులను సత్వరమే పూర్తయ్యేలా చూడాలన్నారు. తనిఖీలు నిర్వహించి చెక్‌లిస్టు ప్రకారం 26 అంశాలు సక్రమంగా అమలవుతున్నాయా అని పరిశీలించాలన్నారు. ఈ పథకం అమలు తీరును ప్రధానమంత్రి కార్యాలయం నుంచి పర్యవేక్షిస్తున్నారన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కింద మంజూరై ఇంకనూ ప్రారంభం కాని చెత్త నుండి సంపద కేంద్రాలను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పంచాయితీ అధికారి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

తిరుపతి జూకు చేరిన కొత్త జంతువులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



తిరుపతి శ్రీ వెంకటేశ్వర జంతుప్రదర్శనశాలకు కేరళ రాష్ట్రం త్రివేండ్రం జూ నుండి నాలుగు హైనాలు, ఆరు హాగ్ డీర్‌లను అధికారులు తెప్పించారు. బుధవారం జూలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షెడ్లలో వాటిని అధికారులు విడిచిపెట్టారు. కాగా మంగళవారం కర్నూలు జిల్లా నుండి ఇటీవల తిరుపతి జూకు తీసుకువచ్చిన నాలుగు పెద్దపులి పిల్లల్లో ఒకటి అనారోగ్యంతో మతి చెందిన విషయం విదితమే. మిగిలిన మూడు పెద్ద పులి పిల్లలు ఆరోగ్యంగానే ఉన్నాయని జూవర్గాలు తెలిపాయి.

జెఆర్ కన్‌స్ట్రక్షన్ సీజ్

తిరుపతి టౌన్ : ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న శ్రీనివాస సేతు ఫ్లై ఓవర్ పిల్లర్లపై అనుమతి లేకుండా స్టిక్కర్లను వేసి అపరిశుభ్రంగా చేసిన జెఆర్ కన్‌స్ట్రక్షన్స్‌ను నగర పాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశాల మేరకు సీజ్ చేసినట్లు పట్టణ ప్రణాళిక విభాగం అధికారి షన్ముగం తెలిపారు. నగరంలో ఎక్కడైనా ఎవరైనా అనుమతులు లేకుండా పోస్టర్లు అతికించినా, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని, జరిమానాలు విధిస్తామని కమిషనర్ హెచ్చరించారు.





పండుగలా క్రీడా పోటీలు : ఎంపి

క్యాంపస్ : 'గ్రామీణ యువతను ఏకం చేయడం అందరికీ సాధ్యం కాదు.. అసాధ్యాన్ని సుసాధ్యం చేయగల సత్తా ఒక్క చెవిరెడ్డికి మాత్రమే ఉంది.. 15వేల మంది యువకులను ఒకే వేదికపైకి తీసుకురావడం అషామాషీ కాదు.. క్రీడలను ఒక పండుగ వాతావరణంలో చేయడం చాలా సంతోషంగా ఉంది. కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా రకరకాల కార్యక్రమాలు చేయడం చెవిరెడ్డికి వున్న ప్రత్యేకత. ఈ తరం రాజకీయ నేతలకు ఎమ్మెల్యే చెవిరెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలి' అని రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి ప్రశంసించారు. చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంత యువతను ఒక్కటి చేసి వారిలో క్రీడానైపుణ్యతను వెలికి తీయడానికి చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే చంద్రగిరి ఐపీఎల్ వైఎస్ఆర్ గ్రామీణ మెగా క్రికెట్ టోర్నమెంట్ ను బుధవారం మిథున్ రెడ్డి పరిశీలించారు.

శ్రీజ పాల ఉత్పత్తిదారులకు...

నేడు రూ.9.48 కోట్ల బోనస్ : చైర్మన్

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

పాడిరంగంలో చిత్తూరు జిల్లా కేంద్రంగా నేడున్న పోటీ ప్రపంచంలో తనదైన కార్యాచరణతో అందరి ఆదరాభిమానాలను చూరగొంటూ, ప్రపంచంలోనే లక్ష మంది మహిళా సభ్యులు గల ఏకైక పాల ఉత్పత్తి సంస్థగా పేరుగాంచిన శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ త్వరలోనే సంస్థ టర్నోవర్ 1000 కోట్లు సాధించబోతుందని సంస్థ చైర్మన్ కుంటపల్లి శ్రీదేవి ప్రకటించారు. ప్రపంచ పాల దినోత్సవం పురస్కరించుకొని సంస్థకు పాలు అందించే సభ్యులలో పోటీ తత్వాన్ని పెంచడం, దానికి తగిన నగదు ప్రోత్సాహకాలను అందించడం మహిళా ఆర్థిక పురోగతిని సాధించడానికి వీలు అవుతుందన్నారు. అందులో భాగంగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో సంస్థ సభ్యులు ఎవరైతే కనీసం 200 రోజులు లేక 500 లీటర్ల పాలను శ్రీజ సంస్థకు అందించారో వారికి నగదుగా 6,93,39,529/-, 2,547,7,500/- నగదును దఢమైన స్టీల్ పాలకేన్ల రూపములో సభ్యులకు అందించడం జరుగుతుందన్నారు. మొత్తంగా 9.48 కోట్ల రూపాయలను బోనస్‌గా చెల్లించనున్నారు. ఈ బోనస్ ను



చెల్లించడానికి ఇటీవల జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆమోదం లభించిందని చైర్మన్ శ్రీదేవి 'ప్రజాశక్తి'కి తెలిపారు. ప్రపంచ పాల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇంటర్నేషనల్ డైయిరీ ఫెడరేషన్ 2023 థీమ్ గా పౌష్టికాహారం, జీవనోపాధిని అందిస్తూనే పాడి పరిశ్రమ పర్యావరణం పై దుష్ప్రభావాన్ని తగ్గించడంగా నిర్ణయించారని, ఈ నిర్ణయాన్ని శ్రీజ మహిళా పాడి ఉత్పత్తిదారుల సంస్థ కచ్చితత్వంతో పాటిస్తోందని, సంస్థ కార్యకలాపాలను ఆధునికరిస్తూనే పర్యావరణం పై ప్రభావాన్ని క్రమేపీ తగ్గించుకుంటూ పనిచేస్తుందన్నారు. అందులో భాగంగా నీటిని పొదుపుగా వినియోగించడం, సేంద్రియ పశు ఆహారం, సోలార్ విద్యుత్ ఉత్పత్తి కలిగిన ప్లాంట్లలో పాల ప్రాసెస్ చేయడం వంటి ఎన్నో చర్యలను శ్రీజ సంస్థ పాటిస్తోందన్నారు. ఇంటర్నేషనల్ డైయిరీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆఫ్రికా ఖండంలోని రువాండా దేశంలో జరుగుతున్న ప్రపంచ పాల దినోత్సవానికి ఆదేశం ఆహ్వానం మేరకు శ్రీజ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ జయతీర్థచారి అతిథిగా వెళ్లారన్నారు. అక్కడ జరిగే కార్యక్రమంలో భాగంగా శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ విజయప్రస్థానాన్ని ఆ దేశ ప్రజలకు, కార్యక్రమానికి హాజరైన వివిధ దేశాల ప్రజలు వివరిస్తారన్నారు. సంస్థకు సంబంధించిన అన్ని లావాదేవీలను ఆన్లైన్ ద్వారానే జరుపుతూ నెలకు రెండు సార్లు తమ సభ్యుల బ్యాంకు ఖాతాలలో పాల బిల్లులను నేరుగా జమ చేస్తూ ఎక్కడా కరెన్సీ వాడకం లేకుండా ఆన్లైన్ పద్ధతి ద్వారానే కార్యకలాపాలను సాగిస్తోందన్నారు. ఇంత గొప్ప ఘన విజయాలను సాధించడానికి సహకరిస్తున్న ఎన్డీడిబి, ఎన్డీడిబి డెయిరీ సర్వీసెస్, మదర్ డెయిరీకి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేస్తున్నామని శ్రీజ సంస్థ చైర్మన్ శ్రీదేవి తెలిపారు.

పౌరహక్కులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - యంత్రాంగం



బిఎన్ కండ్రిగ : ప్రతి పౌరుడూ తమ హక్కులను వినియోగించడంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ హనుమంతనాయక్ అన్నారు. పౌరహక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కంచన పుత్తూరు గ్రామ గిరిజన కాలనీలో పౌరహక్కులపై అవగాహనా కార్యక్రమం జరిగింది. నిమ్నజాతులను కించపరిచేలా మాట్లాడితే చట్టప్రకారం శిక్షార్హులని తెలిపారు. సచివాయలంలో అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతినెలా చివరిరోజున గ్రామాలలో సివిల్స్ రైట్‌డే నిర్వహించాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి పర్యాటక ప్రాంతాలలో ఆర్థిక వనరులను కల్పిస్తామన్నారు. ఇల్లులేని పేదలకు ప్రభుత్వం భూమిని, రేషన్‌కార్డులను ఇవ్వాలని, సిసి రోడ్లను నిర్మించాలని గ్రామస్తులు కోరారు. పంపిణీకి ప్రభుత్వ భూమి లేదని, అమ్మేవారు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సిసి రోడ్ల ఏర్పాటుకు నివేదికలు తయారు చేయాలని ఎంపిడిఒ త్రివిక్రమరావును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మంజునాథరెడ్డి, విఆర్ఒ వెంకటేశ్వర్లు, సర్పంచి బట్టా స్వప్న, తేజ, గురునాథం పాల్గొన్నారు.

వెంకటగిరిలో... రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ వి.చెంగల్‌రాణి ఆధ్వర్యంలో విశ్వనాథపురంలో జరిగింది. భారత రాజ్యాంగంలో పొందుపరచిన పౌరహక్కులను అందరూ ఉపయోగించుకోవాలని, ప్రభుత్వ అధికారులు సమస్యను పరిష్కరిస్తారన్నారు. హక్కులకు భంగం కలిగించేలా ఎవరైనా ప్రవర్తిస్తే పోలీసు శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అట్రాసిటీ కమిటి సభ్యులు మోపూరు అదీవయ్య, పోలేపల్లి కోటేశ్వరరావు, విఆర్ఒ హేమభద్రరావు పాల్గొన్నారు.

పెళ్లకూరులో... కానూరు రాజుపాలెం ఎగువ కానూరు ఎస్టీ కాలనీలో జరిగింది. డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగితే పోలీసులను ఆశ్రయించాలన్నారు. తమ దృష్టికి తీసుకొస్తే 'వివక్ష'కు సంబంధించిన ఏ సమస్య అయినా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సురేష్‌బాబు, విఆర్ఒ చాణిక్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ప్రకాష్, యుఒపి ఆర్‌డి విజయమ్మ పాల్గొన్నారు.

నానో ఎరువులు..!

బస్తాలు పోయి బాటిళ్లొచ్చే...!
మార్కెట్లో యూరియా, డిఏపి లభ్యం

ప్రజాశక్తి - బాలాయపల్లి

నానో ఎరువులను రైతులు వాడటం వల్ల పర్యావరణ కాలుష్యాన్ని కాపాడుకోవచ్చు. పంట దిగుబడి గణనీయంగా పెరుగాలన్నా, ఉత్పత్తులు నాణ్యంగా రావాలన్నా గుళికల రూపంలో ఉన్న డీఏపీ (డై-అమోనియం ఫాస్ఫేట్)నే అందరూ వాడతారు. ప్రస్తుతం రైతులు మోతాదుకు మించి వీటిని కుమ్మరించడం వల్ల నేలలో భాస్వరం నిల్వలు పెరుగడంతో పాటు నీరు, వాయుకాలుష్యం ఎక్కువై అనర్థాలకు దారితీస్తోంది. ఈ నేపథ్యంలో ద్రవరూపంలో డీఏపీని అందుబాటులోకి తీసుకొచ్చింది. బస్తాల బాధ తప్పించి జేబులో పెట్టుకొని తీసుకెళ్లేలా రూపొందిన ఈ 'నానో డీఏపీ' బాటిల్స్ వల్ల రైతులకు ఖర్చు తగ్గడమే గాక ఆర్థికంగా లాభం చేకూరనుంది.

ప్రయోజనాలు అధికం

గుళికల కంటే ద్రవరూప డీఏపీ వల్ల రైతులకు అనేక ప్రయోజనాలున్నాయి. ఎరువుల దుకాణంలో బస్తాలను కొనుక్కుని పంట క్షేత్రానికి తరలించాలంటే తలకు మించిన భారమవుతుంది. తప్పని సరిగా వాహనం ఉంటేనే బస్తాలను తీసుకెళ్లడం వీలవుతుంది. పొలాల వద్దకు దారి లేని రైతులకైతే మరీ ఇబ్బందిగా ఉంటుంది. అదే నానో డీఏపీని చాలా సులువుగా జేబులో పెట్టుకొని పంట వద్దకు తీసుకెళ్లి పిచికారీ చేసుకోవచ్చు. ఎలాంటి పర్యావరణ సమస్యలుండవు. పైరుకు నేరుగా ఆకులపై పడి తొందరగా పనిచేస్తుంది. ఘన రూపంలో(గుళికల) బస్తా పని చేయాలంటే 10 నుంచి 12రోజుల సమయం పడుతుంది. అదే ద్రవరూప డీఏపీ అయితే కేవలం 3 నుంచి 5 రోజుల్లో తన పనిని ప్రారంభిస్తుంది. ఈ ద్రవరూప డీఏపీలో 8శాతం నత్రజని, 16శాతం భాస్వరం మిళితమై ఉంటుంది. 100 నానోమీటర్ కంటే తక్కువ ఘనపరిమాణం ఉండడం వల్ల పంటలకు మంచి పోషకాలు త్వరగా అందుతాయి. దీని వల్ల పంట నాణ్యత, దిగుబడి పెరుగుతుంది. 90శాతం మందు పంటపైనే పనిచేస్తుంది. ఒక డీఏపీ బస్తాకు సమానంగా పనిచేస్తుంది. 500 మిల్లీ లీటర్ల డీఏపీ బాటిల్ ధర రూ.600 ఉంది. అంటే బస్తా డిఏపి రూ 1400 ఉంది. రైతులకు ఒక్కో బస్తాపై రూ.800 మిగులుతుంది.



ద్రవరూపంలో యూరియా

పంట పొలాల్లో నత్రజని పాత్రను ఏమాత్రం తక్కువ చేయలేం. పంటల ఎదుగుదల, పచ్చదనం విషయంలో యూరియా బాగా పనిచేస్తుంది. అయితే యూరియాను ద్రవరూపంలో తీసు కొచ్చింది. రైతులు బస్తాలోని యూరియాకు సమానంగా లిక్విడ్ యూరియా పనిచేసినట్లు గుర్తించారు. దీనికి తోడు ఇప్పుడు ద్రవ రూపంలోనె డీఏపీని అందుబాటులోకి తెచ్చింది. నానో యూరియా, డీఏపీని మన రాష్ట్ర మార్కెట్లోకి విడుదల చేశారు.

రైతులకు ఎంతో మేలు : శిరిష, ఏఓ బాలాయపల్లి



నానో ఎరువుల వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఖర్చు తగ్గడంతో పాటు రవాణా భారం తగ్గుతుంది. గతేడాది అందుబాటులోకి వచ్చిన నానో యూరియా పనితీరు బాగానే ఉంది. రైతుల నుంచి ఫీడ్‌బ్యాక్ బాగుందనే వచ్చింది. పాడైపోతున్న పర్యావరణాన్ని ఈ నానో ఎరువుల వల్ల కొంతమేర కాపాడిన వారమవుతాం. వ్యవసాయంలో వస్తున్న మార్పులను రైతులు ఎప్పటికప్పుడు తెలుసుకొని పాటించాలి. యూరియాను రైతులు వాడాలంటే గతంలో ట్రాన్స్‌పోర్టుకు డబ్బులు కేటాయించాలి. ఈ నానో ఎరువులు అలా కాదు... అరకిలో బాటిల్ కొనుక్కుని ఎంచక్కా జేబులో పెట్టుకుని పొలానికి తీసుకెళ్లవచ్చు.





ఘనంగా తిరుచానూరు గంగజాతర

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుచానూరు గంగ జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ కె.రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీలో గంగజాతర వేడుకగా చేశారు. పంచాయతీలో విద్యుత్ దీపాలంకరణలు చేసి, అందర్నీ ఆకట్టుకునేలా అమ్మవారి భారీ విద్యుత్ కటౌట్‌ను నెలకొల్పారు. స్థానికులు ఉదయాన్నే పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. జాతరకు వచ్చే భక్తులకు అమ్మవారి ప్రసాదాలు, అంబలి పంపిణీ చేశారు. వైసిపి నాయకులు, ఆర్‌ఆర్ యూత్ ఆధ్వర్యంలో భక్తులకు తాగనీరు అందించారు. క్యూలైన్లు ఏర్పాటు చేసి ప్రజలందరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా క్రమపద్ధతిలో అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. యువత పెద్ద ఎత్తున ఉత్సహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పొక్కాలమ్మగుడి చైర్మన్ శ్రీదర్‌రెడ్డి, తిరుచానూరు ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు, వైసిపి నాయకులు, ఆర్‌ఆర్ యూత్ నాయకులు పాల్గొన్నారు.

మామిడిరైతులు దళారులను నమ్మొద్దు



చిన్నగొట్టిగల్లు : మామిడి రైతులు దళారులను నమ్మకుండా, రైతుసంఘాల ద్వారా నేరుగా కాయలను మండీలకు తరలించాలని జిల్లా ఉద్యానవన అధికారి దశరథరామిరెడ్డి రైతులకు సూచించారు. మామిడి రైతులు పక్వానికి వచ్చిన కాయలనే కోస్తే రుచి బాగుండి ధర ఉంటుందన్నారు. మండల ఉద్యానశాఖాధికారి శివకుమారి ఆధ్వర్యంలో తవ్వావాండ్లపల్లిలోని బాలాజీ రైతుసంఘం మండలంలో ఉద్యానశాఖ ద్వారా ఏర్పాటు చేసిన ఉద్యాన ఉత్పత్తుల సేకరణ కేంద్రం కలెక్షన్ సెంటర్‌ను సందర్శించారు. దళారీ వ్యవస్థ లేకుండా రైతులే నేరుగా మార్కెటింగ్, ఎగుమతిని రైతుసంఘాల ద్వారా ఎలా చేస్తున్నారో పరిశీలించారు. రైతుసంఘాలను ప్రోత్సహించడానికి ఉద్యాన శాఖ ఎపుడూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రాజారెడ్డి పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి : కమిషనర్

తిరుపతి టౌన్ : పని వేళల్లో సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశించారు. సరోజనీదేవి రోడ్డులోని 38వ వార్డు సచివాలయాన్ని బుధవారం మధ్యాహ్నం ఆమె తనిఖీ చేశారు. నలుగురు కార్యదర్శులు మాత్రమే ఉండడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుబాటులో లేనివారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్‌కు వెళితే ఖచ్చితంగా మూమెంట్ రిజిష్టర్‌లో నమోదు చేయాలని, లేకుంటే గైర్హాజరుగా చూస్తామన్నారు. ప్రతిరోజూ ఖచ్చితంగా యూనిఫాం ధరించి తప్పక హాజరుకావాలని ఆదేశించారు.

చంద్రబాబుకు నరాలు చిట్లాయి: ఆర్‌కె రోజా

ప్రజాశక్తి - తిరుపతి సిటి



జగన్ చేయగలిగినవే చెప్పి, చేసి చూపించారని మంత్రి ఆర్‌కె రోజా అన్నారు. జగన్ పాలన చూసి చంద్రబాబుకు నరాలు చిట్లాయని మండిపడ్డారు. 600 హామీలు ఇచ్చి ఆరు హామీలు కూడా నెరవేర్చని వ్యక్తి చంద్రబాబని అన్నారు. బుధవారం తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ సిఎం జగన్ తన పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారన్నారు. చంద్రబాబులాంటి మోసగాడు దేశంలోనే ఎక్కడా లేదని ఎద్దేవా చేశారు. వాలంటీర్ వ్యవస్థతో లబ్దిదారుల ఇంటికే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. జగన్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 98.5 శాతం నెరవేర్చారని ఉద్ఘాటించారు. మేనిఫెస్టో అంటే చంద్రబాబుకు చిత్తుకాగితంతో సమానమన్నారు.

కొడాలి నాని దిష్టిబొమ్మ దగ్ధం

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)



కాపు కులస్తులను 'కాపు నాకొడుకులు' అని వైసిపి మాజీ మంత్రి కొడాలి నాని దూషించడాన్ని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ బలిజ నేతలు బండ్ల లక్ష్మీపతి, రంగూన్ శంకర్, కరుణానిధి, గూడూరు భాస్కర్, రామకృష్ణలు మండిపడ్డారు. తిరుపతి ప్రెస్‌క్లబ్ ఆవరణలో కొడాలి నాని దిష్టిబొమ్మను బుధవారం దహనం చేశారు. అధికార పార్టీకి చెడ్డపేరు తెస్తున్న నాని క్షమాపణ చెప్పని పక్షంలో ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని, నాని ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.

సీతారాంను స్పీకర్ పదవి నుంచి తొలగించాలి : టిడిపి

తిరుపతి (మంగళం) : టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడుకు జడ్ ప్లస్ క్యాటగిరీ ఎందుకని హేళనగా విమర్శించిన స్పీకర్ తమ్మినేని సీతారాంను కేంద్రం వెంటనే స్పీకర్ పదవి నుంచి తొలగించాలని టిడిపి నగర అధ్యక్షులు వట్టికుంట శంకర్‌నారాయణ (చినబాబు) డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఆముదాలవలసలో స్కూటర్ ర్యాలీలో పాల్గొన్న స్పీకర్‌కు ఎండ వేడికి వడదెబ్బ తగిలి మతిభ్రమించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులు నాగప్రతాప్, జగ్గయ్య, జ్ఞాన, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మహిళల సంక్షేమాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

పుత్తూరు టౌన్ : మహిళల సంక్షేమాభివృద్ధి తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి యాళ్ల లక్ష్మీప్రసన్న అన్నారురు. మంగళవారం వడమాలపేటలో మహిళలతో కలిసి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మహానాడు వేదికగా మహాశక్తి పేరిట మహిళలు ప్రకటించిన పథకాలు అమోఘమైనవని, 18 ఏళ్ల నుంచి ప్రతి ఆడబిడ్డకు 1500 అందజేయడం, అమ్మకు వందనం, దీపం పథకం తదితరాలన్నీ మహిళాభివృద్ధికి ఉపయోగపడతాయన్నారు.

గూడూరులో ... జ్యోతిరావుపూలె, ఎన్టీఆర్, చంద్రబాబునాయుడు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. బీసీలకు గుర్తింపు తెచ్చింది టిడిపి మాత్రమేనని టిడిపి పట్టణ అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలె నాయకులు బిల్లు చెంచురామయ్య, ఇజ్రాయిల్, శ్రీనివాసులు, శేఖర్ పాల్గొన్నారు.

విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యులుగా ధనశేఖర్



ప్రజాశక్తి-తిరపతి సిటి భారతీయ దళిత సాహిత్య అకాడమీ రాష్ట్ర అధ్యక్షులు, పోగ్రెసివ్‌సపారీ కర్మచారి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, తిరుపతికి చెందిన డాక్టర్ గుండ్లూరి ధనశేఖర్‌ను తిరుపతి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా నియమిస్తూ జిల్లా కలెక్టరు వెంకటరమణారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ధనశేఖర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనకు ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని తెలిపారు.

రేపు టిఎన్‌టియుసి రౌండ్‌టేబుల్ సమావేశం

పుత్తూరు టౌన్ : కార్మికుల సమస్యలపై శుక్రవారం టిఎన్‌టియుసి ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం ఉంటుందని చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షులు రావిళ్ల మాధవనాయుడు తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నాలుగేళ్ల కాలంలో సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు పడుతున్న ఇబ్బందులపై సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బాలసుబ్రమణ్యం, మనోజ్ పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం' ఫిర్యాదులపై సమీక్ష

ప్రజాశక్తి -గూడూరు ప్రజల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్నకు చెబుదాం 1902 టోల్ ఫ్రీ నెంబర్ను ఏర్పాటు చేసిందని, దీనికి వచ్చిన ఫిర్యాదులపై పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించామని గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఫిర్యాది దారులు తమ సమస్యలను ఆర్డిఓ దష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి, కమిషనర్ సాయినాథ్, డివిజన్ లోని తాసిల్దార్లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పొగాకు వాడకం ప్రాణాంతకం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిలా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టరు యు.శ్రీహరి ఆద్వర్యంలో ప్రపంచ పోగాకు నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డిఎం అండ్ హెచ్‌వో కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ రామకృష్ణ డీలక్స్ సర్కిల్, జ్యోతి థియేటర్ సర్కిల్, క్రైమ్ స్టేషన్, మహతి ఆడిటోరియం మీదుగా టౌన్‌క్లబ్ వరకు సాగింది. ఈ సందర్భంగా డిఎంహెచ్‌వో మాట్లాడుతూ మనిషికి సరైన పౌష్టికాహారం కావాలి కానీ, పొగాకు కాదన్నారు. ప్రజలందరూ మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని, పోగాకు వంటి ఉత్పత్తులకు దూరంగా ఉండాలని సూచించారు. పొగాకు వినియోగం వల్ల పర్యావరణం కాలుష్యం అవుతుందని, మనిషి ఆయుష్షు క్షీణిస్తుందన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థల పరిధిలో 100 గజాల లోపు ఉన్న దుకాణాల్లో సిగరెట్, ఇతర పొగాకు ఉత్పత్తులను అమ్మకూడదని తెలిపారు. వీటిని అతిక్రమించిన వారిపై కోప్టో యాక్టు 2003 చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాట జరిమానా విధించడం జరుగుతుందన్నారు. పబ్లిక్ ప్లేస్‌ల్లో పొగాకు తాగడం నిషేధం. అందుకు 200 రూపాయలు జరిమానా విధించవచ్చని తెలిపారు. దీనిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించడం కోసం జిల్లాలోని ప్రతి పిహెచ్‌సి, యుపిహెచ్‌సి, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు జరిపించాలని సూచించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న వారి చేత పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌వో డాక్టరు సుధారాణి, హనుమంతరావు, శాంతకుమారి, హరినాథ్, అరుణ, డిఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది, కృష్ణతేజ డెంటల్ కాలేజి విద్యార్థులు, టాటా కన్సల్టెన్సీ బృందం పాల్గొన్నారు.

దొరవారిసత్రంలో.. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది బుధవారం జాతీయ పొగాకు నియంత్రణ దినంపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రం వద్ద మానవ హారం ఏర్పాటు చేశారు. డాక్టర్ చైతన్య మాట్లాడుతూ చుట్ట, బీడీ, సిగరెట్ అనారోగ్యానికి తొలిమెట్టని, పొగాకు పదార్థాల వాడకాలు వద్దని, మంచి ఆరోగ్యమే మన హద్దు పొగాకు వాడకం వల్ల క్యాన్సర్ వస్తుందన్నారు. పొగాకు నియంత్రణపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ సంపూర్ణమ్మ, సూపర్వైజర్ పద్మావతి కిరణ్, వైద్య సిబ్బంది సుధాకర్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా అవగాహనా ర్యాలీలు



విత్తన దుకాణాలపై విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి-నాయుడుపేట



రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ విభాగం డిజి డాక్టరు రవిశంకర్ ఆదేశాల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా విజిలెన్స్ అధికారులు విత్తనాల విక్రయ దుకాణాల్లో బుధవారం తనిఖీలు చేశారు. అందులో భాగంగా తిరుపతి జిల్లాలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నాయుడుపేటలోని మూడు దుకాణాల్లో తనిఖీలను నిర్వహించారు. ధరలు, స్టాక్ తెలియపరిచే పట్టికలను ప్రదర్శింకపోవడం, స్టాక్ నిర్వాహణ సరిగా నిర్వహించనందున ఆ దుకాణాలకు 8వేల రూపాయలు విలువల 10 కేజీల విత్తనాలను స్టాప్ సేల్ ఆర్డర్‌ను నాయుడుపేట వ్యవసాయ అధికారి జారీ చేశారు. ఇలాంటి తనీఖీలు ఇకపై తరుచూ నిర్వహిస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ జిల్లా అధికారి ఈశ్వర్‌రెడ్డి తె లిపారు.

'కొల్లం' ఆయుర్వేద సంస్థలు పరిశీలన

ప్రజాశక్తి-తిరుపతి సిటి

కేరళ రాష్ట్రంలోని ప్రముఖ ఆయుర్వేద ఆసుపత్రులు, కళాశాలలు, ఫార్మసీల నిర్వాహణ విధానాలను అధ్యాయనం చేస్తున్న టిటిడి అధికారుల బృందం బుదవారం కొల్లంలోని అమృత ఆయుర్దేవ ఆసుపత్రి, కళాశాల, ఫార్మసీ పరిశోధనాలయాన్ని సందర్శించింది. టిటిడి జేఈవో సదాభార్గవి, సిఏవో శేషశైలేంద్ర, ఆయుర్వేద ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టరు రేణు దీక్షిత్ మూడు రోజులుగా కేరళలో పర్యటిస్తున్న విషయం విదితమే. ప్రపంచ వ్యాప్తంగా జనం ఇక్కడికి ఆయుర్వేద వైద్య చికిత్స, పంచకర్మ కోసం రావడానికి గత ప్రత్యేకతల గురించి వీరు అధ్యయనం చేశారు. ఆసుపత్రికి రోగులు ఆనైన్ల ద్వారా, నేరుగా వచ్చి ఓపి, ఇన్ పేషెంట్ సేవలు పొందుతున్న విధానం గురించి అక్కడి అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఉచిత, ఫీజు వసూలు చేసే కేటగిరీల వైద్య సేవల వివరాలు తెలుసుకున్నారు. రోగులు ఏ ప్రాంతం నుంచి ఇక్కడికి ఎలా చేరుకుంటున్నారనే సమాచారం తీసుకున్నారు. ఫ్రీ రూములు, పెయిడ్ రూములను, వాటి నిర్వాహణ పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి డీన్ డాక్టరు శంకర్ అమృతానంద పురి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు రమేష్, రీసెర్చ్ హెడ్ డాక్టరు రాం మనోహార్, టి టి డి ఆయుర్వేద కళాశాల పూర్వ విద్యార్థి, ఆ కళాశాల ప్రొఫెసరు డాక్టరు వినీత్‌తో కలిసి వివిధ అంశాలపై చర్చించారు.

జగనన్న భూ రక్ష సమగ్ర భూసర్వే విజయవంతం

ప్రజాశక్తి -కోట

జగనన్న భూ రక్ష సమగ్ర సర్వేలో భాగంగా బుధవారం వంజివాకలో గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభలో గ్రామంలోని రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రీ సర్వే డిప్యూటీ తాహాసిల్దార్ పల్లవరపు.ఆశాజ్యోతి, మండల సర్వేయర్ పి గోపి మాట్లాడుతూ సమగ్రపు సర్వేలో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా మండలంలోని నెల్లూరు పల్లి కొత్తపాలెం, లక్ష్మకండ్రిగ లో సర్వే విజయవంతంగా పూర్తయిందన్నారు. ఈ రెండు గ్రామాలలో సర్వే రాళ్లను నాటామన్నారు. కోట మండలంలో మొత్తం 19 రెవెన్యూ గ్రామాలలో రెండు గ్రామాలలో సమగ్ర సర్వే పూర్తయింది. మొదటి దశలో భాగంగా వంజీవాక, కొక్కుపాడు, ఉత్తమనెల్లూరు, తిన్నెలపూడి గ్రామాలలో 2 వ దశ సర్వే ప్రారంభమవుతుందన్నారు. అందులో భాగంగా మొదట వంజివాకా గ్రామంలో గ్రామ సభను ఏర్పాటు చేశామన్నారు. వంజివాక రెవెన్యూ పరిధిలో ఉన్న చీకళ్ళ దిబ్బలో మొదట సర్వే ప్రారంభం అవుతుంది అన్నారు. దశలవారీగా మిగిలిన గ్రామాల్లో సర్వే జరుగుతుందని పేర్కొన్నారు. సర్వే సమయంలో ప్రతి రైతూ తమ భూమికి సంబంధించిన పత్రాలను అధికారులకు సమర్పించాలన్నారు.. అగ్రిమెంట్, పిత్రార్జితం, రిజిస్ట్రేషన్ పత్రాలు అధికారులకు సమర్పించాలని కోరారు. సర్వే సమయంలో ప్రతి రైతు తమ పొలం వద్ద ఉండాలని సూచించారు. సర్వే జిటి పద్ధతిలో అత్యంత ఖచ్చితంగా జరుగుతుందన్నారు. గొలుసు విధానంలో కంటే జిటి పద్ధతిలో వంద శాతం కచ్చితంగా ఉంటుందన్నారు. డ్రోన్లు సర్వే అనంతరం విజయవాడ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన ఓ ఆర్ ఐ మ్యాప్స్ ద్వారా సర్వే జరుగుతుందన్నారు. సర్వే సమయంలో హక్కుదారునికి ఎటువంటి పత్రాలు లేకపోయినా విచారించి వారికి హక్కు పత్రాలను ఇస్తామన్నారు. పొలాలతోపాటు గ్రామంలోని ఇల్లు ఇళ్ల స్థలాలను కూడా స్వామిత్వ పథకం ద్వారా పంచాయతీ, రెవెన్యూ అధికారులు మూకుమ్మడిగా కలిసి ప్రతి ఇంటిని సర్వే చేసి వారికి హక్కు పత్రాలు ఇస్తామన్నారు. పంచాయతీ సెక్రటరీ రియాజుద్దీన్, మండల సర్వేయర్ పి గోపి, వీఆర్వో కష్ణయ్య,గ్రామ సర్వేయర్ చందు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో ఎన్నికలన్నీ భయంభయంగానే : టిడిపి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక ఏ ఎన్నికలైనా ప్రజాస్వామ్య బద్ధంగా జరిగాయా? అని టిడిపి తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహ యాదవ్ ప్రశ్నించారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏమి అభివద్ధి సాధించారని వైసీపీ నాయకులు సంబరాలు చేసుకుంటు న్నారన్నారు. నాలుగేళ్లుగా రాష్ట్రంలో ఎక్కడ చూసినా అణిచివేత ధోరణి, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించడం, సోషల్ మీడియాలో పోస్ట్ పెడితే కూడా కేసులు పెట్టి వేధించడం చేశారే తప్ప రాష్ట్రానికి ఏమి పరిశ్రమలు తీసుకొచ్చారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఖజానాకు చెందాల్సిన 3 లక్షల కోట్లు జగన్ కు చేరాయని ఆరోపించారు. మోసపూరిత వాగ్దానాలు చేసి రాష్ట్ర ప్రజలను జగన్ నమ్మించి మోసం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి తిరుపతి పార్లమెంటు కార్యదర్శి యశ్వంత్ రెడ్డి, నాయకులు సింగంశెట్టి సుబ్బరామయ్య, రుద్రకోట సదాశివం, మనోహరాచారి పాల్గొన్నారు.

రైతులకు టూల్‌కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్



మండలంలోని కాపుగున్నేరి పంచాయతీ రైతు భరోసా కేంద్రం ఆవరణలో బుధవారం 40 మంది రైతులకు సంబంధించి ఎస్.ఎఫ్.ఏ.సి న్యూఢిల్లీ వారిచే కాళహస్తీశ్వర రైతు ఉత్పత్తిదారుల సంఘంలో ఉన్న ఎఫ్.ఐ.సి గ్రూపు సభ్యులకు లైట్లు ట్రాప్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్.ఎఫ్.ఏ.సి డైరెక్టర్ మురుగేషన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎస్.ఎఫ్.ఏ.సి ఆధ్వర్యంలో సుమారు పదివేల ఎఫ్.పి.ఓ సంఘాలుగా లు ఉన్నాయని అన్నారు. అలాగే వీటి ద్వారా రైతులు తాము పండిస్తున్న పంటలను గిట్టుబాటు ధరకే విక్రయించడానికి వీలవుతుందని దళారులను నమ్ముకొని మోసపోవాల్సిన అవసరం లేదని తెలిపారు. శ్రీకాళహస్తి ఎఫ్.పి.ఓ సంఘం సీఈవో జగదీష్, ఉద్యానవన శాఖ అధికారిని శ్రీలత, కాపుగున్నేరి ఎఫ్ఈఓ డైరెక్టర్ మధు రెడ్డి, బత్తిరెడ్డి పాల్గొన్నారు.

నిధులివ్వకపోతే అభివృద్ధి ఎలా..?

పుత్తూరు టౌన్ : గ్రామాభివృద్ధికి, పంచాయతీ పనులకు నిధులు ఇవ్వకపోతే అభివృద్ధి ఎలా చేపట్టాలని అధికార ప్రతిపక్ష సర్పంచులు ధ్వజమెత్తారు. బుధవారం ఎంపిపి మునివేలమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఇందిరమ్మ మాట్లాడుతూ వివిధ శాఖల అధికారుల అభివృద్ధి పనులను వివరించారు. తిరుమలకుప్పం, తడుకు గ్రామసముద్రం సర్పంచులు లేచి పంచాయతీలకు నిధులు ఇవ్వడం లేదని, మూడేళ్లుగా విద్యుత్ సమస్యపై పరిష్కారం కోరగా నేటికీ పట్టించుకోలేదని నిలదీశారు. పెద్ద పనులకు అనుమతి తీసుకోవాలని, చిన్న చిన్న పనులకు సొంత నిధులతో చేసి బిల్లు పెట్టుకుంటే మంజూరు చేస్తామని ఎంపిడిఒ తెలిపారు. ఎంఇఒ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రజాప్రతినిధుల, అధికారుల పిల్లలను చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునుస్వామిరెడ్డి, విమలమ్మ, ఎఒ కోదండయ్య, ఉద్యానశాఖ అధికారి వెంకట సౌజన్య పాల్గొన్నారు.

'అబద్దాల చంద్రబాబును ప్రజలు నమ్మరు'

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారిని పలువురు రాజకీయ ప్రముఖులు బుధవారం ఉదయం దర్శించుకున్నారు. మంత్రి జోగి రమేష్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ వెలుపల ఆయన మాట్లాడుతూ పరిపాలన అంటే జగన్మోహన్ రెడ్డి పరిపాలనలా ఉండాలనే స్థాయికి వచ్చిందన్నారు. ప్రజల మనసుల్లో సీఎం జగన్ సుస్థిరమైన స్థానం సంపాధించుకున్నారని అన్నారు. ఏపిలో బ్రహ్మాండంగా అభివద్ధి జరుగుతుందని చెప్పిన ఆయన, అభివద్ధి అంటే ఒకే చోట జరిగేది కాదని, అభివద్ధి అంటే అన్ని ప్రాంతాలకు, అన్ని గడపలకు వెళ్ళాలి అని జగన్ ధృడ సంకల్పంతో ఉన్నారని చెప్పారు. అబద్దాల చంద్రబాబును ప్రజలు నమ్మరని అన్నారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబు గల్లంతవుతారన్నారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ మేనిఫెస్టోకు అర్థం తెలియని వ్యక్తి చంద్రబాబని అన్నారు. రాష్ట్రంలో దాదాపు పది ఫిషింగ్ హార్బర్ లను త్వరలోనే ప్రారంభించబోతున్నామని, విశాఖపట్నంలో భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ నిర్మాణం, మిగిలిన పారిశ్రామిక పనులు పెద్ద ఎత్తున జరుగుతున్నాయన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి : సీఐ

ప్రజాశక్తి - ఓజిలి

సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాయుడుపేట రూరల్ సీఐ వైవి. సోమయ్య ప్రజలకు అవగాహన కల్పించారు. ఓజిలి మండల కేంద్రంలోని ప్రధాన మార్కెట్ కూడలి వద్ద బుధవారం సాయంత్రం దుకాణదారులకు , ఆటో కార్మికులకు , గ్రామస్తులకు సైబర్ నేరస్తులు ఆశలు కల్పించి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు . సామాజిక మాధ్యమంలో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోకూడదని , ప్రజలు తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఫోన్ లలో పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్ డేట్ చేయమని వచ్చే మెసేజ్ లకు స్పందించ కూడదన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 నెంబర్? కు డయల్ చేయాలన్నారు. ప్రజలు అవగాహనతో అప్రమత్తంగా ఉంటే సైబర్ నేరాలకు చెక్ పెట్టచ్చని పేర్కొన్నారు.





గంగమ్మకు సారె సమర్పించిన మేయర్

తిరుచానూరు : తిమ్మినాయుడుపాలెం దళితవాడలో మంగళ, బుధవారాల్లో గంగజాతర జరిగింది. బుధవారం డివిజన్ కార్పొరేటర్ బోకం అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో కలిసి మేయర్ డాక్టర్ శిరీష అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ తిరుపతి గంగజాతర ముగిసిన రెండో వారం తిమ్మినాయుడుపాళెం గంగజాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ అనీల్‌కుమార్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు జాతర వేడుకగా జరిగిందని, బుధవారం రాత్రి దున్నపోతును ఊరేగింపుగా తీసుకొచ్చి గంగమ్మకు బలి ఇవ్వడంతో గంగజాతర ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, కుప్పయ్య, బుచ్చయ్య, జీవన్, మణి, కృష్ణయ్య పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై 'గోవిందుడు'

తిరుపతి సిటి : తిరుపతి గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఉదయం గోవిందుడు వరదహస్తంతో హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వాహనసేవ ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఉత్సవం కోలాహలంగా జరిగింది. భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. అనంతరం ఉత్సవరులకు స్నపన తిరుమంజనం జరిగింది. మధ్యాహ్నం వసంతోత్సవం నిర్వహించారు. రాత్రి గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వాహన సేవల్లో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, కంకణభట్టర్ ఎపి శ్రీనివాస దీక్షితులు, డిప్యూటీ ఈవో శాంతి, ఎఇఒ రవికుమార్, సూపరింటెండెంట్ నారాయణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాధాక్రిష్ణ పాల్గొన్నారు.

కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నారాయణవనం : శ్రీ పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు బుధవారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ధ్వజస్తంభం వద్ద విశేష పూజ చేసిన అనంతరం స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి పెద్దశేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నాగరత్న, ఎఇఒ మోహన్, సూపరింటెండెంట్ ఏకాంబరం, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం

గూడూరు టౌన్ : పట్టణంలోని రాజా వీధిలో వెలసి ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా స్వామివారికి విశేష అలంకరణ ,ప్రత్యేక పూజలు నిర్వహించారు. గరుడ చిత్రపటానికి పూజలు నిర్వహించి మంగళ వాయిద్యాలతో ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించి కోడి ముద్ద ప్రసాదాలు అందుకున్నారు.

నేడు లింగేశ్వరస్వామి కుంభాభిషేక మహోత్సవం

కోట : మండలంలోని కొక్కుపాడు గ్రామం సూరిశెట్టిపాలెంలో నూతనంగా నిర్మించిన శ్రీ లింగేశ్వర స్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా కుంభాభిషేక మహోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం వేదాస్తం నారాయణ భట్టాచార్యులు ద్వారా జరపనున్నారు. విద్వాన్ టివి గణేష్ గురుకుల్ (శివాచార్య) వారి పరివారం పాల్గొంటారని శ్రీ లింగేశ్వర స్వామి దేవస్థానం ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పైడిపల్లిలో వినాయకస్వామి కుంబాభిషేకం

క్యాంపస్ : తిరుపతి రూరల్ మండలం పైడిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయ మహా కుంబాభిషేకంలో చంద్రగిరి వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పాల్గొన్నారు. బుధవారం ఆలయం వద్ద జరుగుతున్న ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన పూర్ణాహుతిలో భాగస్వామ్యం కావడంతో విజయం వరించాలని అర్చక స్వాములు వేద పఠనం చేశారు.